

# నాకు తెలిసిన మహానుభావుడు

ఏ. ఏ. కె. రంగారావు

పదిసంవత్సరాల క్రిందట మల్లాది రామకృష్ణశాస్త్రిగారెవరో నాకు తెలియదు. తెలుగుభాషలో నా ప్రవేశం అంతమాత్రం. అయిదు సంవత్సరాల ముందు వారితో ముఖ పరిచయం కూడా లేదు. పెద్దల సాంగత్యానికి అంత అలవాటుపడిన వాడిని మరి. నాలుగేళ్ళక్రితమే వారి పరిచయం కలిగింది. తన ప్రభావం నాపై ప్రసరించింది. అదే నా పాలిట దివ్యమైన వరమై-జటిలమైనవీ, క్లిష్టమైనవీ అని వదిలివేసిన ఉత్కృష్ట మార్గాలలో నన్ను పయనింపజేసి, నాకందని పండ్లనుకున్న వాటిని అందించినది. అంతకు ముందు గొంతెమ్మ కోరికలనిపించే గగన కుసుమాలు భగీరద ప్రయత్నంతో సాధ్యములని తెలియ జెప్పినవి. నా తాహతు యెంతటిదో నా అర్హత యేవిటిదో నా పరిధి యెంతవరకు యే విధంగా యెందుకని విస్తృతం చేసుకోవాలో బోధ పరచినది.

* * *

ఈనాటి ప్రపంచంలో మానవునికి దేవుడివ్వగలిగిన వరాలెన్నో లేవు. సదాచార సంపన్నులైన తలిదండ్రులు, ముక్తిదాయకుడైన గురువు, అనుగతవతి అనురాగవతియైన సతి, సత్సంతానము, యివి నాలుగు వరాలు. వీటి ఫలితం ఐహికం కాకపోయినా ప్రభావం ప్రతిబింబించేది లౌకిక జీవనం మీదనే. మరొక్క వరం వున్నది. అది సాహిత్య కృషిని ప్రోత్సహించి కావ్యకుతూహలాన్ని పెంపొందించి సన్మార్గాన రచనా వ్యాసంగాన్ని నడిపించగల గురువు.

సదాచార సంపన్నులైన తలిదండ్రులు లేకపోతే తక్కిన సన్మీమాంసలంటే మనసు ఆరాట పడుట అరుగు. ఆరాటమే లేనప్పుడు ఆ లేమి బాధించదు. సన్మార్గుల కడుపున పుట్టడానికి పూర్వజన్మ సుకృతం వుండాలి, అలా వున్నవారికి సద్గురువు, ముక్తి ప్రయత్నాలలో చేదోడు వాదోడుగా వుండటానికి, లభించక మానడు. ఇవి రెండూ వుంటే, యీ కలిమిలో అనుపమ గుణాంబుధియైన భార్య లేకున్నా కీర్తిదాయకులైన సంతానము లేకున్నా, అది ఒక బాధగా తోచదు. కాని మొదటి రెండు వరాలు పొందినవారిలో తప్పకవుండే సృజనాత్మకమైన తపనకు ఉత్తమమైన లక్ష్యాన్ని చూపించి, దానిని పొందుటకు సక్రమమైన దారిని సూచించి అడుగడుగునా విమర్శలతో, ఆశీస్సులతో, అంక్షలతో ఆ ప్రవాహాన్ని సాహితీ సాగరోన్ముఖంగా పయనింపజేయగలిగిన విద్యాగురువు లేకపోతే, ఆ లేమి, ఆ కొఱత, ఆ కోత, ఆ బాధ దుర్భరమే.

* * *

మిత్రులు బాపు, రమణ పరిచయమైనప్పటినుంచీ చెప్పుతునే వుండేవారు, శాస్త్రిగారి కథలు చదవమని. చెప్పగా చెప్పగా "కాముని పున్నమి"తో కొన్ని కథలు చదవాను. వాళ్ళేమైనా అనుకుంటారని బాగానే వున్నాయి కాని నా కంతగా నచ్చలేదని చెప్పాను. వాళ్ళిద్దరూ నిర్ఘాంతపోయి ఆ అంతస్తుకి నీ వింకా పెరగలేదని చెప్పటానికి నోరురాక మాటాడక ఊరుకున్నారు. అప్పటికి నేనింకా రామకృష్ణశాస్త్రిగారిని కలుసుకోనలేదు.

మొదటిసారి వారిని చూచినది "కలిమిలేములు" చిత్రానికి వారు వ్రాసిన "కొమ్మలమీద కోతి కొమ్మచ్చులాడింది తెల్లాతెల్లని బుల్లి యెండా" అనే యెండమీదనే వెన్నెలవంటి కవనం రికార్డింగ్ జరుగుతున్నపుడు. రచన యెంత మధురంగా వుందీ అనుకున్నాను. తాంబూల చర్వణం చేస్తూ పచ్చకర్పూరపు ఘుమాయింపుతో ముందు కూర్చున్న శాస్త్రిగారిని చూచి సౌమ్యులూ - సహృదయులూ అనుకున్నాను.

అప్పుడే ఆంధ్రపత్రికలో సినిమా సంగీతం గురించి వ్రాయాలనే ఉద్దేశం కలగటమూ దానికి పేరేమిటి పెట్టాలనే విషయంలో మాలో తర్జన భర్జన బయలుదేరటమూ జరిగింది. ఏవేవో అనుకున్నాముగాని మా ముగ్గురికీ యేదీ నచ్చలేదు. శాస్త్రిగారిని అడుగుదామనే ఆలోచన కలిగింది. మేము చెప్పినవన్నీ విని "సరాగమాల" అని నామకరణం చేశారు. "మానసోల్లాసమ్," "ఆనందమోహన కావ్యమాల" కూడ వారు పెట్టిన పేర్లే. అవును మరి వారి రచనోద్యానాలలో విరిసిన అసంఖ్యాక సుమాలను ఒకటో రెండో సంగ్రహించి చెండు కట్టితే వాటికి వారు పేరు పెట్టడంలో వింతేమున్నది?

"సరాగమాల"లో మొట్టమొదట వ్రాసింది వారి "కలిమిలేములు" పాట గురించే. ఆ తరువాత యెన్నోమార్లు, వారి పాటలను పరిచయంచేస్తూ వారు వాడిన మాటలనే

వాడటం, ఆ సంగతి తెలియని పాఠకులనుంచి యెన్నో ప్రశంసలను పొందటం జరిగింది. "మానసోల్లాసమ్" శీర్షికతో మొదటి వ్యాసం వస్తువుకు ఆధారం వారు పెట్టిన పేరే. రేపు "ఆనంద మోహన కావ్యమాల"తో వేయబోయే మొదటిది వారు సూచించిన "జనార్దనాష్టకమే!"

అప్పట్లోనే వారి పాత పాటలన్నీ మరోమారు నెమరు వేసుకున్నాను. ఇతరుల పాటలలో వారికే చేతనైన మెత్తని పదప్రయోగాలు వుండటం గమనించాను. "కళలకు రాణులూ, కపురపు వీణెలూ మా నెరజాణలూ," "జాణతనమునను, నా ప్రేమునను నీసరి గడుసరి లేడురా" (స్త్రీ సాహసం), "ఇవి ఆ కొమ్మ గురుతులు కాబోలు" (జయభేరి) పాటలు వారివేనా అని తెలిసి వుండవలసిన వారిని అడిగాను. అవునన్నారు కొందరు. అబ్బే కాదు-అవి సముద్రాలవీ, ఆరుద్రవీ అన్నారు మరికొందరు. చివరికి శాస్త్రిగారినే అడిగాను. ఇదమిద్ధమని తేల్చకుండా ఒక మాటని ఊరుకోమన్నారు. ఆలోచిస్తే సముద్రాల రాఘవాచార్యుల వద్ద మల్లాది కొంతకాలం వుండుటవలన ఆ ఛాయలు ఆ నాటివారి పాటలలోనూ, ఆ నాటికీ యీ నాటికీ ఆరుద్ర శ్రీమల్లాదిని గురుతుల్యులుగా భావిస్తారు కనుక ఆ పోకడలు వీరి మాటలలోనూ కనబడటం ఒక వింత కాదు.

ఆ తరువాతి ఉగాదికే ననుకుంటాను ప్రభ, పత్రిక వార పత్రికలలో శాస్త్రిగారి "రాగమాలిక", "ఏలేలో" కథలు చదివాను. మొదటిమారు పూర్తిగా అర్థం కాలేదు కాని వాటిలో అజ్ఞాతంగా వున్న యేదో ఒక అందం, ఆకర్షణ మళ్ళీమళ్ళీ ఆ కథలను చదివించినవి. అంతవరకు నా కనుల కప్పిన పొరలు విడివడ్డాయి. తెలుగు అందమేమిటో తెలిసింది ఆ రోజు. అసలు తెలుగని దేన్ని అంటారో అర్థమయింది ఆ తరుణాన. అప్పటికప్పుడు వారి కథలు దొరికినవన్నీ చదివాను. మళ్ళీమళ్ళీ చదువుకున్నాను. ప్రతి మాటా ఒక ప్రత్యేక సౌందర్యంతో దీపించడం వారి కథల ప్రత్యేకత.

మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథలో వున్న రమ్యత వర్ణించడానికి నేనే కాదు యెవరూ చాలరు.

ఆ. వె. దమన వనమునందుఁ దనరు సౌరభమును
మలయ సానువందుఁ జెలగుగాలి
కలసి హాయిఁ గొలుపుఁ గవివరు మల్లాది
రామకృష్ణు వచన రచన యందు.

అని విఫల ప్రయత్నాలు చేసిన వారెందరో వున్నారు. కాని ఘంటాపథంగా చెప్పగలిగిన విషయం ఒకటి వున్నది. తెలుగు సాహిత్యంలో శృంగార రసప్రధాన రచనలు యెన్నో వుంటాయి. దైవపరంగా చెప్పబడిన "గీతగోవిందం" వంటి మహా కావ్యాలలో కూడ కొన్నిచోట్ల వుండే శృంగార వర్ణనల గురించి మన అక్కచెల్లెళ్ళతో బాహాటంగా తెలుగులో ముచ్చటించుకోలేము. ఈ మాత్రం కళంకమైనా లేనిది శాస్త్రిగారి శృంగార సృష్టి. "రాగమాలిక"నే కథలో మాధవలతనే వయసునున్న వేశ్య దేవాలయ ప్రాంగణంలో సుందరుడూ, నవయవ్వనుడూ అయిన ఒక సన్యాసిని నిలవేసి, కోరిక కన్నుల్లో మెరవగా స్వామీ పుత్రభిక్ష అని అడుగుతుంది. మరుక్షణమే, ఆ యోగి అమ్మా అని ఆమెను సంబోధిస్తాడు. ధన్యను నేను. కోరినదే కోరిక తీర్చారని మాధవీలత మోకరిల్లుతుంది. ఇంతకు మించిన పవిత్ర శృంగారం, యింతకన్న పునీతమైన భావ సంపద, యింతటి కోరిక, యింతకన్న భగవత్కాంతా ప్రేరకమైన సన్నివేశము యీ నాటి రచనలలో ఉండటం అరుదు.

* * *

ఏ సత్కార్యం తలపెట్టినా వారి ఆశీస్సు పొందిన తరువాతనే! ఒక యేడాది రాజమహల్లో కృష్ణజయంతి వేడుకలు జరపాలని అనుకున్నాము. వారం రోజులముందే ఆశీస్సులకని వారికి వ్రాశాను. ఏ రోజు వచ్చినా పండుగ చేసే వుత్తరం కృష్ణాష్టమినాటి ఉదయం సరిగ్గా అందినది. సారాంశం.

"ఆశీః—
ఆహ్వానము అందుకున్నాను
ఆనంద కృష్ణుని లలితకళామయాశీస్సులు,-
వాని గొలిచేవారికి యెన్నటికీ పరిపూర్ణ
ఫలదాయినులే!
మీ యిలు వానికి పండుగగా,-
మిమ్మెడబాయని వేడుకగా
ఆనంద మోహనుడు మీ కనుల కాపురమై
నూరేళ్ళపాటు మీ సేవలదనిని
మిమ్మనుగ్రహించేను."

అంతటి ఆశీస్సు అందుకొన్న మా కేమి కొఱత! ఆ నాడు మాత్రం శ్రీకృష్ణుడు సంతోషంగా సగం పూజనే స్వీకరించాడు. మిగిలిన సగం మల్లాదికే అర్పితమైనది.

నా చేత అక్షరాభ్యాసం కూడా వారే చేయించారు అని చెప్పుకోవడం అతిశయోక్తి అవుతుంది. కాని యిది నిజం. వారి యెదుటనే యేదో ఒక శీర్షిక ప్రారంభించనుంటే చూసి శ్రీపంచకం వ్రాయమన్నారు. ఎలా వ్రాయాలో తెలియక ఒకదాని ప్రక్కన ఒకటి వ్రాస్తుంటే కాదు యిలా వ్రాయమని చెప్పి వ్రాయించారు.

నా చదువుకు మించినదీ, ఒకప్పుడు నా ఊహకు కూడా అందనిదీ నే నెప్పుడైనా తలపెడితే, అందులో లేశమైనా విజయం సాధిస్తే దీని వెనుకనున్న బలం శ్రీ మల్లాది రామ

కృష్ణ శాస్త్రిగారు జరిపించిన యీ శ్రేయోత్తరాభ్యాసమే.

మరొకమారు ప్రణయ బృందావని అనే రేడియో సంగీత రూపకం ప్రసారం చేసేముందు యిలా వ్రాశారు:

"మధురాధిపతే రఖిలం మధురమ్
అన్న సరసోక్తికి లలిత నిదర్శనముగా
సర్వ మధురముగ యీ రేయి,
పవన లాలిత మయ్యేనని-భావన
కలివేలుపు చియనవ్వులె కలకాలము
మీ కైతల మెలగేనని దీవెన!"

ఆ నాటి కార్యక్రమం రక్తి కట్టడానికి వారి ఆశీస్సులు యెంత కారణమో నాకు తెలుసు.

ఆశీస్సులే కాదు, ప్రతి రచనా చదివి నాకు తెలియవలసిన విషయాలు కార్డుద్వారానో, కనబడినప్పుడో తెలిపేవారు. ఈ ఆశీస్సులు, సలహాలు నాకెంత విలువైనవో నేను నా రచనలకని మాటలు ఉపయోగించినపుడు వారి వద్ద నుంచి వచ్చిన మందలింపులూ అంతటివే. అన్నిటా చిన్నవాడనని సత్ప్రయత్నాలను హర్షించేవారు. కొందరైనా యితరులు వుంటారు కాని క్షణికమైన వ్రాతలో కూడ తప్పులు తెలియజెప్పి సరిదిద్దే ఓపికా, ప్రేమా అటువంటి పెద్దలతో యెందరికి వుంటుంది?

* * *

బహుముఖ ప్రజ్ఞావంతులని యెందరినో అంటారు. కాని ఆ బిరుదు వారికి తగినట్లుగా మరెవ్వరికీ సరిపోదు. వారి నిర్యాణానంతరం వారి మిత్రులు వ్రాసిన వ్యాసాలు ఒకొక్కటి చదువుకొనడం-వారికి హార్మోనియం వాయించడం వచ్చునట, అలంకార శాస్త్రం వేదం చెప్పేవారట, పాళీ భాషలో ప్రవీణులట అని చెప్పుకుంటూ విస్తుపోవడం అందరికీ, ఆత్మీయుల మనుకున్న వారికే పరిపాటయింది. అంత రంగికులకూ తెలియని వారి విన్నాణాలెన్నో!

* * *

వారు వెళ్ళిపోయారు. పామరులై యేడ్చి మనోభారం తీర్చుకోగలిగిన వాళ్ళూ,యేడ్చినా తీరనివాళ్ళూ యెందరో! వారిలో నేనూ ఒకడిని. కాని యిక యీ జన్మకు ఆ విషయమై విచారం లేదు. ఉండకూడదు. వారి అనుచరులలో యిటువంటి పామరత్వం వారు సహించలేరు. ఇక యీ జన్మకు సాహిత్య వ్యాసంగంలో ఒకటే ధ్యేయం-ఒకటే ధ్యాస. ఎప్పటికైన ఒక రచన చేసి, సాహితీవేత్తలతో సహృదయులతో ఒక మెప్పు పొందాలి. ఏమని? మల్లాది రామకృష్ణశాస్త్రి ఆశీస్సుతోనే పీఠింతటి వాడైనాడని! ఇన్ని మెట్లెక్కించి యెక్కడో వున్న నన్ను యింత వఱకు తెచ్చిన వారి ఆశీస్సు అంతవరకూ తీసుకు వెళ్ళగలదనే నా నమ్మకం. *

---

# రంగూ రుచీ ఎరిగిన రామకృష్ణశాస్త్రిగారు

(19 వ పేజీ నుంచి)

మించి ఎదగడానికి అవకాశాలు నశించాయి. మనిషి అడ్డంగా పెరుగుతున్నాడు. అందువల్ల మనిషికీ మనిషికీ తేడా తెలియడం మానేసింది అని. అందుకే అనుకుంటాను, శాస్త్రిగారు తాడిచెట్ల ప్రమాణంలో ఉన్న వ్యక్తులకోసం, వెనుకటి తీరానికి పోయారు. ఇప్పటివాళ్ళని కూడా వెనుకటి తరానికి పట్టుకుపోయారు. వాళ్ళని గురించి చెప్పడానికి వెనుకటి తరం భాషకి ప్రాణం పోశారు. పదును పట్టారు. నిజంగా వెనుకటివాళ్ళ కథల్లో ఆయన ప్రతిభ పరాకాష్ఠ నందుకుంది-కాముని పున్నమితో-ఏ వాక్యం చదవండి. అది తెలుగే-జీవంతో మిలమిలలాడే తెలుగు. మొదటి వాక్యమే కొన్ని పేజీలు-అది కాశీమజిలీ కథలా పెనవేసుకుని విచ్చుకుంటూ చిలవలూ పలవలూ వేసుకుంటూ సాగిపోతుంది.

"అలా తూలక, తూలక పోలుతూన్న, చిన్నివాని చేతికి ఏ రెమ్మ తాకెనో-ఏ ముల్లు పోకెనో-మూగపోయిన గొంతు ఉలికి పడంగా గొంతువిని-కొమరైన కన్నెలందరూ కమ్ముకుని-అరచేత,గంటులున్న చోటు కంట తడిమి మాని ఏ కన్నె కా కన్నె మనసాగ చేతికందిన విరులు దూసుకురాంగా-పుప్పొడిజల్లి-చిదిమిన పూవులు అదిమి, ఆ పైన కప్పురపు అనంటి పొరచుట్టి, పోకీ పోకని లగువున, బిగుతు తెలియకుండా చేతికి కట్టుచుట్టి 'పాయెపో-పాయెపో-' అని కిలకిల మంతిరించి .."

ఇలా అనంతంగా బరిమీది త్రాచులా పారిపోయే తెలుగు, మిసమిసలాడే తెలుగు, వ్రాయగలవాళ్ళు మరి లేరు. అందుకే నాకు బెంగ. చాలా విలువైన దేదో ఆయనతో అంతరించి పోయినట్టు అనిపిస్తుంది. *

Source: Press Academy Website, Anandavani Magazine, 1940

Disclaimer: This SELECTIVE topic/article/write-up by V A K Ranga Rao gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/